ధారావాహిక
భాగం -5

# చైతన్య స్రవంతి

(సాంఘిక నవల)



## డా జి భవానీ కృష్ణ మూర్తి

"నమస్కారం శాస్త్రిగారూ!"

వీధి అరుగు మీద పడక్కుర్చీలో కూర్చుని, చుట్టూ కూర్చుని ఉన్న ఐదుగురు పిల్లలచేత వేదం వల్లె వేయిస్తున్న పురుషోత్తశాస్త్రి గారు తలెత్తి చూశారు.

"నమస్కారం, నాపేరు రాఘవరావు, ఈమె నా భార్య జానకి. మీతో కాస్త మాట్లాడదామని.. విజయవాడ వాస్తవ్యులం "అన్నాడు, చేతులు జోడించి.

"శివా, రేపు చెప్పుకుందాం వెళ్లి రండి" విద్యార్థుల్ని పంపేశారు. "రండి, అక్కడ గోలెంలో నీళ్ళున్నాయి, కాళ్ళు కడుక్కుని ఇలా వచ్చి కూర్చోండి" ఇద్దర్ని ఆహ్వానించి, తన కుడిచేతి పక్కగా ఉన్న రెండు కర్ర కుర్చీలను చూపించారు శాస్త్రి గారు.

రాఘవారావు, జానకమ్మ కాళ్ళు కడుక్కుని మూడు మెట్లు ఎక్కి, అరుగు మీదకు వెళ్లి కుర్చీల్లో కూర్చున్నారు. అక్కడే గోడవారగా ఒక బల్ల మీద రెండు దేవుని ఫోటోలు పూల దండలు వేసి ఉన్నాయి. వాటి ముందు ఒక పక్కగా దీపం వెలుగుతూ ఉంది. ఫోటోల ముందు ఉన్న పళ్లెంలో కొన్ని పూలు, రెండు అరటి పళ్ళు ఉన్నాయి. జానకమ్మ లేచి, తాము తెచ్చిన పళ్ళు, పూలు, తీసి ఆ పళ్లెంలో పెట్టి, ఐదువందల రూపాయల నోటు కూడా పెట్టి, దణ్ణం పెట్టుకుని, వచ్చి కూర్చుంది.

"చెప్పండి... ఏం పని మీద వచ్చారు? "అడిగారు శాస్త్రి గారు.

"మా స్వస్థలం పక్కనే ఉన్న అల్లవరం... మానాన్న నారాయణ. మీ తండ్రిగారు శంకరశాస్త్రిగారు మాఇంటి పురోహితులు."

"ఓహో... నారాయణ కొడుకా మీరు? గుర్తుంది... నారాయణ పోయాక మీరు ఇటు రాలేనట్లుంది, అందుకే గుర్తు పట్టలేకపోయాను" అన్నారు అరుగుమీద గది దర్జీ వానికి అద్దెకిచ్చినట్లున్నారు,కుట్టు మిషను తిరుగుతున్న చప్పుడు వినిపిస్తోంది.

మరో అరుగు మీద గదిలో కిరాణా దుకాణం. ఎవరో ఒకరు వచ్చి ఏవో సామాన్లు కొనుక్కెడుతున్నారు.

"అవునండి... ఏదో వ్యాపార ఒత్తిడిలో ఇటు రావడం కుదరలేదు. అమ్మ,అయ్యా పోయారు. అన్నయ్య పోయాక ఇక్కడ ఉన్న ఇల్లు పొలం అమ్మేసి, వ్యాపారంలో పెట్టాను. అన్నయ్య పిల్లలిద్దరు ఉద్యోగరీత్యా ఒకరు బొంబాయిలో, ఒకరు మద్రాసులో ఉన్నారు. కరోనా కారణంగా

కోలుకోలేని దెబ్బ తగిలింది. ఆరోగ్యం కూడా సహకరించకపోవడంతో ఇంక విశాంతి తీసుకుంటున్నాను. అమ్మాయికి పెళ్లయి అమెరికాలో ఉంది.అల్లుని ఆరోగ్యం అంతంతగా ఉంది.

అబ్బాయి ఇంజనీరింగ్ పాసయ్యాడుగాని ఉద్యోగం మానేసి, భవననిర్మాణం మీద ఆసక్తితో రాజమండ్రిలో ఒక షాపింగ్ మాల్ నిర్మాణం పని మొదలు పెట్టాడు. ఆర్థికంగా ఇంకా నిలదొక్కుకోలేదు. మీరు వారి జాతకాలు చూచి,పరిహారాలు ఏమైనా చెపుతారేమోనని..."ఆగాడు రాఘవరావు.

"లోపల కూర్చుందాం రండి "అని, లేచి లోపలికి నడిచారు.

ఇద్దరూ లోపలికి వెళ్లారు.

పెద్ద మండువా.చుట్టూ వరండా ఒకపక్క రెండు ద్వారాలు, మరోపక్క రెండు ద్వారాలు, అవి గదులు అయి ఉంటాయానుకుంది జానకమ్మ. ఎదురుగా వంట గది.తలుపు తెరిచిఉండడం వల్ల కనిపిస్తోంది. పక్కగా మరో ద్వారం ఏ స్టోర్ రూమో అయి ఉంటుంది అనుకుంది.

శాస్త్రిగారు వెళ్లి ఒక పక్కగా ఉన్న కుర్చీలో కూర్చున్నారు. కుర్చీకి ఎడమ పక్కగా ఒక టేబుల్ ఉంది.దానిపై ఒక పంచాంగం, కళ్ళజోడు కొన్ని తెల్లకాగితాలు,పెన్ను ఉన్నాయి.

మండువా చుట్టూ నాలుగు మూలల లావుగా నగిషీలతో అందంగా ఉన్నాయి రాతి స్థంభాలు. ఒక స్థంభం దగ్గర చిన్న బల్ల మీద ఒక కంచు చెంబు మూత పెట్టి ఉంది. పక్కన రెండు కంచు గ్లాసులు ఉన్నాయి. అవి చూపిస్తూ "మంచినీళ్లు తీసుకోండి" అన్నారు శాస్త్రిగారు. జానకమ్మ భర్తకి ఇచ్చి, తాను కొన్ని తాగి కూర్చుంది.

రాఘవరావు "తమరి పిల్లలు..." ఆగిపోయాడు.

"అబ్బాయి, కోడలు అమెరికాలో ఉన్నారు... అమ్మాయి పెళ్లయి విశాఖపట్నంలో ఉంది" అన్నారు నిర్లిప్తంగా.

"ఒక్కతే అమ్మాయా?"

"అవును"

రాఘవరావు, జానకమ్మ ముఖముఖాలు చూసుకున్నారు.

జాతకాల కాగితాలు ఆయన పక్కనున్న బల్ల మీద పెట్టాడు రాఘవరావు.

ముందుగా రాఘవరావు జాతకం చూసి "ఇప్పుడు మీకు ఏలినాటి శని దశ నడుస్తోంది అందుకే ఈ ఒడిదుడుకులు. ఆర్థిక ఇబ్బందులు. వీలున్నప్పుడు నవగ్రహాల గుళ్లో శనికి తైలాభిషేకం చేయించండి.

అబ్బాయికి.... వివాహం అయిందా?"అడిగారు సాలోచనగా చూస్తూ.

"అయింది స్వామి"

"జాతకంలో కొన్ని దోషాలున్నాయి ద్వితీయానికి అవకాశం కనిపిస్తోంది "

"పరిహారాలేమైనా..." ఆగిపోయింది జానకమ్మ.

ఒక కాగితం మీద రాసి ఇచ్చి, "ఈ హోమాలు పూజలు, దానాలు చేయించుకోమనండి. నమ్మకం, భక్తి, శ్రద్ధ ముఖ్యం."అన్నారు.

"తమరు వచ్చి చేయిస్తే బాగుంటుంది. మీరు ముహూర్తం నిర్ణయిస్తే అన్నీ సమకూర్చుకుని, మీకు కారు పంపిస్తాను. మీరు, అమ్మగారు వచ్చి ఆ కార్యక్రమం జరిపించాలని మాకోరిక "చేతులు జోడించి అన్నాడు రాఘవరావు.

"కుటుంబపోషణ కోసం వంశపారంపర్య వృత్తిని నేను నిర్వహిస్తున్నాను గానీ, ఆడవారికి అలాఎక్కడికీ వచ్చే అలవాటులేదు" అన్నారు శాస్త్రిగారు.

రాఘవరావు కనుసైగ గమనించి "అమ్మగారితో నేను మాట్లాడతాను" అని, జానకమ్మ లేచి వంటింటి గుమ్మం దగ్గరకు వెళ్లి, సావిత్రమ్మతో "అమ్మా!గురువుగారితో పాటు మీరు కూడా మా ఇల్లు పావనం చెయ్యాలి" అని గట్టిగా అని, "అమ్మా, మీ అమ్మాయి స్రవంతి మాకోడలు. ఇప్పుడు కడుపుతోంది మిమ్మల్ని చూడాలని కంటతడి పెట్టుకుంటోంది. పిల్లలు తొందరపడ్డారు, మీకు, మాకు కూడా చెప్పకుండా పెళ్ళి చేసుకున్నారు. పెద్దవాళ్ళం మనం పెద్దమనసు చేసుకుని వారిని ఆశీర్వదించాలి. పెద్దమనసు చేసుకుని మీరుకూడా వస్తే బాగుంటుంది. కులమతాలు ఆచారాలు, సంప్రదాయలు మనం ఏర్పరుచుకున్నవి అని మీకు తెలియని విషయం కాదు. మీరైనా మేమైనా కోరుకునేది పిల్లల ఆనందమే కదా." మళ్ళీ గట్టిగా

"మీరిరువురు ఆదిదంపతుల్లా మా ఇంట అడుగుపెడితే మా అందరికి ఆనందం. మా జన్మధన్యం అయినట్లు భావిస్తాం" అని అంది.

కూతురు కడుపుతో ఉంది అనగానే ఆమె తల్లి మనసు కరిగిపోయింది.అయినా బయట పడకుండా "ఏ విషయంలో అయినా నిర్ణయం తీసుకునేది వారే. వారితోనే మాట్లాడండి" అనేసి లోపలికి వెళ్ళిపోయింది సావిత్రమ్మ.

జానకమ్మ "అమ్మగారితో కూడా చెప్పాను గురువుగారు. మీరిరువురు వస్తే మాకు సంతోషం. అది మాకు ఆశీర్వాదంగా భావిస్తా.."

***

